క్లుప్తంగా

డ్యాన్స్ మాస్టర్‌కు 'యువ కళారత్న' అవార్డు



రవీంద్రభారతిలో అవార్డు అందుకుంటున్న ధర్మవరం డ్యాన్స్ మాస్టర్ అస్లాం, శిష్యులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం డ్యాన్స్ మాస్టర్‌కు యువ కళారత్న అవార్డు దక్కింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో భారత్ ఆర్ట్స్ సంస్థ వారు జాతీయ, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ధర్మవరం రాకింగ్‌స్టార్ డ్యా న్స్ అకాడమీ డ్యాన్స్ మాస్టర్ అస్లాం శిష్య బృందం చేసిన డాన్స్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. నాట్య కళాకారులు పడుతున్న కష్టాలపై సందేశాత్మకంగా ప్రదర్శించిన డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం డ్యాన్స్ మాస్టర్ అస్లాంకు 'యువ కళారత్న' అవార్డుతో నిర్వాహకులు సత్కరించారు. నాట్య కళాకారులు కళ్యాణ్, రాయుడు, తన్మయ్, వందన, ప్రవీణ్, చరణ్య, గౌతమ్, కావ్య, గీతికాలు డ్యాన్స్‌లో ప్రతిభ చూపారు.

క్రికెట్ విజేత తలుపుల జట్టు



తలుపుల జట్టుకు ట్రోఫీ బహూకరిస్తున్న అధికారులు

కదిరి అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20 రోజులుగా జరుగుతున్న టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా తలుపుల జట్టు నిలిచింది. సోమవారం నంబులపూలకుంట జట్టుతో ఫైనల్‌లో తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎన్పీకుంట జట్టు 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తలుపుల జట్టు 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ యోగేశ్వరనాయుడు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఆనంద్‌నాయక్ అందుకున్నారు. ఫైనల్‌కు ముఖ్య అతిథులుగా విచ్చేసిన విద్యాశాఖాధికారులు కృష్ణానాయక్, వెంకటరాముడు, వేమనారాయణ, జిలాన్‌లు విజేత తలుపుల జట్టుకు ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, తాహిర్‌వలి, సుబ్బారెడ్డి, ఆజంబాషా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన నబీస్వామి ఉరుసు



అందంగా అలంకరించిన నబీస్వామి దర్గా

పుట్టపర్తి టౌన్: మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లిలో హిందూ ముస్లింలు రెండురోజులపాటు ఐక్యతగా జరుపుకొన్న ఉరుసు సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా నబీస్వామి దర్గాలను రంగురంగుల పూలతో, లైట్లతో అందంగా అలంకరించారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు దేశ్‌ముఖ్ ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా స్వామి గుడిలో చదివింపులుచేసి భక్తులకు పంచిపెట్టారు. దీపారాధన సందర్భంగా హిందూ ముస్లింలు ఐక్యతగా స్వామిని దర్శించుకొని చక్కెర చదివింపులు చేసుకొన్నారు. స్వామిని దర్శించుకొంటే సకల పాపాలు తొలగి మంచి జరుతుందని, కోరికలు నెరవేరుతాయని గ్రామస్తుల నమ్మకం. సోమవారం రాత్రి మతపెద్దలు ఖురాన్ చదివి సారాంశం వినిపించారు. ఉరుసు మహోత్సవానికి చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి ముస్లింలు తరలివచ్చి స్వామిని దర్శించుకొన్నారు.



వైద్య విద్య అభ్యసించడం కష్టం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలు వస్తే చంద్రబాబుకు వచ్చే నష్టం ఏమిటో అర్థం కావడం లేదు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనుకోవడం దారుణం. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు రూ.లక్షల ఫీజులు చెల్లించి ప్రైవేటు కళాశాలల్లో వైద్య విద్యను అభ్యసించడం కష్టం. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పెంచి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి. దీనికి విరుద్ధంగా చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది.

– సంగప్ప, యలకుంట్ల, కనగానపల్లి మండలం



ప్రభుత్వ వైఖరి సరిగా లేదు


కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటు విషయంలో చంద్రబాబు ప్రభుత్వ వైఖరి సరిగా లేదు. రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వ కాలేజీలు వచ్చి మెడికల్ సీట్లు పెరిగితే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. దీనిని ఆలోచించకుండా ప్రభుత్వం మంజూరైన సీట్లను కూడా రద్దు చేస్తామనడం దుర్మార్గం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేయాలనుకోవడం సరికాదు. వైద్య విద్యను పేద విద్యార్థులకు అందకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది.

– వెంకటరాముడు, తగరకుంట, కనగానపల్లి మండలం



విస్తరిస్తున్న క్షయ





గతంలో టీబీ (క్షయ) సోకిందంటే ఆ వ్యక్తిని గ్రామానికి దూరంగా ఉంచేసేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుత సమాజంలో టీబీ అనేది పెద్ద జబ్బు ఏమీ కాదు. అయినా టీబీ సోకిందంటే వెంటనే చికిత్స తీసుకోకపోతే పెను ప్రమాదానికి దారి తీస్తుంది. దీనికితోడు టీబీ అంటువ్యాధి కావడంతో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులతోపాటు చుట్టుపక్కల ఉన్నవారికి కూడా వ్యాధి సోకే ప్రమాదముంది.

- వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- ఏటా క్షయబారిన వందలాది మంది
- అవగాహన లోపంతో అంటువ్యాధికి బలి

ధర్మవరం క్లస్టర్‌లో నాలుగేళ్లలో వయసుల వారీగా క్షయ రోగుల వివరాలు

వయసు	1-20	21-40	41-60	61-70
రోగుల సంఖ్య	186	390	583	301

ధర్మవరం అర్బన్: ధర్మవరం క్లస్టర్ పరిధిలో క్షయ వ్యాధి విజృంభిస్తోంది. ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, కనగానపల్లి మండలాలతోపాటు దర్శినమల పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలన్నీ ధర్మవరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని టీబీ యూనిట్ కిందకు వస్తాయి. క్షయ వ్యాధికి గురైన వారు చాలామంది ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే డాట్స్ చికిత్స పద్ధతి ద్వారా వైద్యం పొందుతుంటే మరికొంతమంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఏటా వందల సంఖ్యలో గుర్తింపు

ధర్మవరం క్లస్టర్ పరిధిలో ప్రతి ఏటా వందల సంఖ్యలో క్షయవ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారు. నాలుగేళ్లలో మొత్తం 1,460 మంది టీబీ సోకినవారిని గుర్తించారంటే ఎంత తీవ్రత ఉందో అర్థమవుతోంది.

క్షయతో పెను ప్రమాదం

క్షయ వ్యాధి మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే సూక్ష్మక్రిముల ద్వారా సంక్రమిస్తుంది. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం, ఛాతిలో నొప్పి, దగ్గినప్పుడు రక్తం పడటం ఇవన్నీ టీబీ వ్యాధి లక్షణాలు. రెండుసార్లు గళ్ల పరీక్ష ద్వారా, ఎక్స్‌రే ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు.

అంటువ్యాధి

టీబీ సూక్ష్మ క్రిముల ద్వారా సంక్రమిస్తుంది. రోగి దగ్గినా, తుమ్మినా టీబీ క్రిములు సన్నని తుంపర్ల ద్వారా గాలిలోకి వ్యాపిస్తాయి. ఈ తుంపర్లను ఆరోగ్యవంతులు పీల్చినప్పుడు వారికి కూడా ఈ వ్యాధి సోకే అవకాశాలున్నాయి.

చికిత్స విధానమంతా ఉచితమే

క్షయ వ్యాధిని మూడు కేటగిరిలుగా విభజించారు. మొదటి కేటగిరిలో గళ్లలో క్రిములు ఉంటే ఆరు నెలల డాట్స్ చికిత్స ఇస్తారు. రెండో కేటగిరిలో గళ్లలో క్రిములతోపాటు చికిత్స డీఫాల్టర్ అయితే ఎనిమిది నెలలు చికిత్స అందిస్తారు. నాల్గో కేటగిరి మొండి రకపు టీబీ వ్యాధి. 24 నెలల నుంచి 27 నెలల వరకు డాట్స్ పద్ధతి ద్వారా ఇంజక్షన్లు, మందులు అందించి నయం చేస్తారు.

మారిన మందుల ప్రక్రియ

గతంలో వారానికి మూడు డోసులు ప్రకారం క్షయ వ్యాధిగ్రస్తులకు మందులను ఆశా కార్యకర్త లేదా వలంటీర్ దగ్గరుండి మింగించేవారు. ఒకరోజు అర గంటలో ఏడు మాత్రలు మింగాల్సి ఉంటుంది. దీంతో చాలామంది రోగులు మందులను వాడిన సమయంలో కడుపులో మంట, అరటగా ఉండటంతో మందులను సక్రమంగా వాడటంలేదు. దీంతో ప్రభుత్వం ఫిక్స్‌డ్ డైలీ కోర్స్ అని ప్రతిరోజూ నిర్ణయించిన మందులు ప్రకారం వాడితే సరిపోతుంది. అంటే రోజు ఒక మాత్ర చొప్పున మింగితే క్షయ వ్యాధిని అరికట్టవచ్చు.

అవగాహన లోపం

క్షేత్రస్థాయిలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించకపోవడంతో రోగుల సంఖ్య పెరుగుతోంది. చాలామంది మామూలు దగ్గు అనుకుని చిన్నపాటి వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వం అందించే డాట్స్ మందులను వాడితేనే క్షయవ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది. కానీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో రోగుల సంఖ్య పెరుగుతోంది.

మందులు వాడితే సరి

క్షయ వ్యాధి సోకడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాను. వైద్యాధికారులు డాట్స్ పద్ధతి ద్వారా మందులను అందిస్తున్నారు. ఆరునెలలపాటు చికిత్స పొందాను. మరో వారం రోజులు మందులు వాడితే సరిపోతుంది. ఇంత ఖరీదైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

– లక్ష్మీనారాయణ, క్షయవ్యాధిగ్రస్తుడు, ధర్మవరం



నూతన పద్ధతి బాగుంది

క్షయ వ్యాధిగ్రస్తులకు గతంలో వారానికి మూడుసార్లు చొప్పున రోజుకు 7 మాత్రలు మింగించేవాళ్లం. దీంతో రోగులు చాలా ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం కొత్త మందులను ప్రవేశపెట్టింది. రోజుకో మాత్ర చొప్పున ఫిక్స్‌డ్ కోర్స్ ప్రవేశపెట్టడంతో రోగులకు అంత భారంగా అనిపించదు. ఈ పద్ధతి బాగుంది.



– క్రిష్టప్ప, టీబీ యూనిట్ సూపర్‌వైజర్, ధర్మవరం

నేడు ఉలవల పంపిణీ

గాండ్లపెంట: మండల కేంద్రం గాండ్లపెంటలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం 80 శాతం సబ్సిడీపై రైతులకు ఉలవలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ సహాయకుడు ప్రతాప్‌నాయక్ తెలిపారు. మండలంలోని ఏడు రైతు సేవా కేంద్రాలకు 300 క్వింటాళ్లు వచ్చాయని ఏఓ లక్ష్మీప్రియ తెలిపారు. ఇందులో ఇప్పటికే 2,560 మందికి 280 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

పీర్ల చావిడికి విరాళం

తలుపుల : మండల కేంద్రం ఎగువపేటలో నిర్మిస్తున్న పీర్ల చావిడికి సోమవారం ఎన్పీకుంట మండలం గాజులవాండ్లపల్లి సర్పంచ్ బూక్యా శాంతమ్మ రూ.20 వేల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని చావిడి నిర్మాణ కమిటీకి సొసైటీ మురళీ ద్వారా అందజేశారు. విరాళం అందించినందుకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

20 నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

కదిరి అర్బన్: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై ఈ నెల 20 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అంజినప్ప తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందంతో నిర్వహించారు. అనంతరం కుమ్మరవాండ్లపల్లి, ఎగువపల్లి పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేశాయి. గ్రామసభలు పూర్తయ్యాక 25న ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవ

నల్లచెరువు: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు. అపరిశుభ్రంగా ఉండే ప్రాంతాలను గుర్తించి వాటిని శుభ్రం చేయడం, పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడం చేయనున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల ప్రజలు కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

సెక్యూరిటీ గార్డుకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన ఆంజనేయులు

పెనుకొండ రూరల్: పెనుకొండ జాతీయ రహదారిపై గుట్టూరు కనుమ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు ఆంజనేయులు గాయపడ్డాడు. వివరాలు.. చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన ఆంజనేయులు గుట్టూరు వద్ద రైల్వే తాత్కాలిక సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజులాగే విధులకు వెళ్తుండగా మార్గంమధ్యలో గుట్టూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రోడ్డు దాటే క్రమంలో వెనుక వైపు నుంచి ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనం ద్వారా పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

కారు బైక్ ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు



శివన్నకు ప్రథమ చికిత్స అందిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని హేమావతి రోడ్డులో మద్దనకుంట క్రాస్ వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం టీఎన్.కోటెకు చెందిన లక్ష్మన్న, శివన్న.. ద్విచక్ర వాహనంలో అమరాపురం మండలం ఉదుగూరు గ్రామంలోని బంధువుల అంత్యక్రియలకు బయలుదేరారు. మద్దనకుంట క్రాస్ వద్ద శివరం నుంచి వస్తున్న కారు.. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న శివన్నకు రెండు కాళ్లు, కుడి చేయి విరిగింది, లక్ష్మన్నకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆటోలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం తుమకూరుకు తరలించారు.

కూలీ బిడ్డకు ఎంబీబీఎస్ సీటు



తల్లిదండ్రులతో లక్ష్మీ సంధ్య

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామానికి చెందిన కూలీ కాంతరాజు, రత్నమ్మ దంపతుల కుమార్తె లక్ష్మీసంధ్య నీట్ పరీక్షలో సత్తా చాటింది. జాతీయ వైద్య విద్య అర్హత ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో 64,486 ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 1,791 ర్యాంక్ సాధించింది. ప్రభుత్వం ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లు కేటాయించడంతో తిరుపతి పద్మావతి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు దక్కించుకుంది. తల్లిదండ్రులు, ఆర్డీటీ సంస్థ ప్రోత్సాహంతో తాను ఎంబీబీఎస్ సీటు సాధించినట్లు లక్ష్మీసంధ్య తెలిపింది.

160 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

మడకశిర: పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో సోమవారం అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన టెన్త్, ఇంటర్, ఐటీఐ, పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగులకు జాబ్‌మేళాకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆపరేటర్ పోస్టులకు మొత్తం 160 మంది నిరుద్యోగులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మాజీ ఆలయంలో పూజలు



అలంకరణలో అమ్మాజీ దేవత

రొళ్ల: మండల పరిధిలోని జీరిగేపల్లి గ్రామంలో వెలసిన అమ్మాజీ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మారక్క, గ్యారక్క, ముడుపక్కల మూల విగ్రహాలను శుభ్రం చేశారు. తర్వాత వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించి మహామంగళారతి ఇచ్చారు. నియోజకవర్గం వ్యాప్తంగా కాకుండా కర్ణాటక ప్రాంతం బెంగళూరు, తుమకూరు, శిర వంటి పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకుడు మారన్న ప్రసాదం అందించారు. ఆలయ కమిటీ ద్వారా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రవక్త మార్గంలో పయనించండి





కదిరి పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మత పెద్దలు, ముస్లింలు



కదిరిలో అనీమియా మసీదు వద్ద రక్తదాన శిబిరం

- భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

కదిరి అర్బన్/ తాడిమర్రి/ బత్తలపల్లి/ తనకల్లు: మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి, ఐక్యత మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని వక్తలు పిలుపునిచ్చారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ పండుగను సోమవారం కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కదిరి పట్టణంలో ఉదయం 9–30 గంటలకు అనీమియా మసీదు నుంచి నానా దర్గా, ఇక్బాల్ రోడ్, మెయిన్‌రోడ్,బైపాస్‌రోడ్ మీదుగా శాంతి ర్యాలీ నిర్వహించారు. అనీమియా మసీదు వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ర్యాలీలో కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు. ర్యాలీలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు అత్తార్ చాంద్‌బాషా, ఎంఎస్ పార్థసారథి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, సీఈసీ మెంబర్ పూల శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ముస్లిం మతపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



తాడిమర్రి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

- తాడిమర్రిలోని జామియా మసీదులో మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మతగురువు పవిత్ర గ్రంథం ఖురాన్‌ను చదివి వినిపించారు. మత సంప్రదాయాలను కాపాడుకోవడానికి పండుగలు దోహదపడుతాయన్నారు. ఆపదలో ఉన్న వారిపై ప్రేమ, దయ, జాలి చూపుతూ చేతనైన సహాయం చేయాలని ఖురాన్ చెబుతుందన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు బాబాఫక్రొద్దీన్, ఇస్మాయిల్, హోటల్ మాబ్బాషా, షాజహాన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.
- ప్రేమాభిమానాల వనంలో వికసించినదే ఇస్లాం అని వక్తలు అన్నారు. సోమవారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా బత్తలపల్లి మండలంలో పలువురు ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టారు. అనంతరం మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ఇతరులను ఆదుకోవడమే మానవత్వమన్నారు. అనంతరం మసీదుల్లో మహమ్మద్ ప్రవక్త జన్మదిన కేక్ కట్ చేసి భక్తులకు పంచారు.
- తనకల్లు మండల వ్యాప్తంగా సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కొక్కంటిక్రాస్‌లో ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ మనుషులంతా సోదరభావంతో మెలగాలన్నారు. మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో అందరూ నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ముతవల్లిలు, ఇమాంలు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా సోమవారం మిలాద్-ఉన్-నబీ సందడి నెలకొంది. ఎన్ఎస్‌గేట్, న్యామద్దెల, మేడాపురం గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తగరకుంట, మామిళ్లపల్లి, కుర్లపల్లి, దాదులూరు, నరసంపల్లి, తూంచర్ల గ్రామాల్లోని మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదుల వద్ద సందడి వాతావరణం నెలకొంది.